
మూసాపేటలో హనుమాన్ శోభాయాత్ర



జై హనుమాన్

జ్ఞానగుణ సాగర్

• వైభవంగా హనుమాన్ జన్మోత్సవ వేడుకలు • ఆలయంలో ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు

హనుమాన్ జన్మోత్సవ వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం కనులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయాల్లో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, చందనం, నూతన వస్త్ర అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు హనుమ ధ్వజాలు, కాషాయ జెండాలను చేతబూని శోభాయాత్ర ఊరేగింపులో పాల్గొన్నారు. శోభాయాత్రలో భాగంగా పలు ప్రాంతాల్లో నిర్వాహకులు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్నం దేవాలయాలు, కాలనీలు, బస్తీలలో హనుమాన్ భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. ఏ కాలనీ, బస్తీ రహదారులు చూసినా కాషాయమయంగా మారిపోయాయి.

– కుత్బుల్లాపూర్


హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు మల్లారెడ్డి, భరతసింహారెడ్డి తదితరులు


గాజులరామారంలో జరిగిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం


జగద్గిరిగుట్టలో వెండర్లకు పులిహోర పంపిణీ చేస్తున్న సాక్షి ఏజెంట్ పాండు, సాక్షి మేనేజర్ వినోద్‌కుమార్ తదితరులు


దేవేందర్‌నగర్‌లో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తూ..


నిజాంపేట్‌లోని హనుమాన్ ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు


దుండిగల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో..


హనుమాన్ శోభాయాత్రలో భాగంగా ఐడీపీఎల్‌లో బటర్‌మిల్క్‌ను పంపిణీ చేస్తున్న కార్మికనేత చింతల నాగరాజు

దైవభక్తితో పాటు దేశభక్తి ఉండాలి


మారుతినగర్‌లో ఓం జెండాను ఆవిష్కరించిన కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి మారుతినగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓం జెండాను స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు దైవభక్తితో పాటు దేశభక్తి ఉండాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పలువురి సహాయ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారుతినగర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో ఓటు వేయించాలి


నార్త్ సిటీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్కూల్ సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రభుత్వాలను పడగొట్టాలన్నా... నిలబెట్టాలన్నా ఓటరు చేతిలోనే ఉంటుందని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. అందుకే ఓటును వజ్రాయుధం అంటారన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఓటు వేయించాలని సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు విలువలను విద్యార్థులకు వివరించారు. తమ తల్లిదండ్రులతో తప్పకుండా ఓటు వేయించాలని వారికి అవగాహన కల్పించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే ఉద్యోగవకాశాలు

సుభాష్‌నగర్: కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే యువత ఉద్యోగవకాశాలు ముడి పడి ఉన్నాయని... ప్రతి ఒక్కరూ ఆంగ్లంపై పట్టు సాధించాలని ఎస్సీఆర్ ట్రస్ట్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం చిత్తారమ్మదేవినగర్‌లోని ఎస్సీఆర్ గ్లోబల్ స్కూల్‌లో ట్రస్ట్ ద్వారా అందించనున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చాలా మంది యువతకు సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేక పోవడంతో సరైన ఉద్యోగాలు రావడం లేదన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ ఇంగ్లిష్‌పై పట్టు సాధించి మంచి ఉద్యోగాలు పొందేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు.

ఉర్సు ఉత్సవాలకు నిజాంపేట మేయర్‌కు ఆహ్వానం


మేయర్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం

నిజాంపేట్: ఉర్సు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌సలీం ఆధ్వర్యంలో షరీఫ్ దర్గా కమిటీ సభ్యులు మంగళవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. షరీఫ్ దర్గాలో నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనాలని మేయర్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు పరమేష్ తన ఇంటి గృహప్రవేశ ఆహ్వాన పత్రికను అందజేశారు.

బీజేపీ గూటికి ఎంఎస్.వాసు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ఎంఎస్‌వాసు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎంఎస్.వాసు బీజేపీలో చేరారు. గతంలో కాంగ్రెస్, బీజేపీలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేసిన వాసు అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో తిరిగి సొంతగూటికి చేరారు. వాసుతో పాటు ఆయన అనుచరులు పార్టీ చేరారు.

మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఎంఎన్‌రెడ్డినగర్, వెంకటేశ్వరకాలనీ, సంజయ్‌పురికాలనీ, నెహ్రూనగర్ ప్రాంతాల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డినగర్‌ఫేజ్ -1, 2, 3, 4, వెంకటేశ్వరకాలనీ ఈస్ట్-వెస్ట్ కాలనీలలో ఆయన ప్రచారం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాలను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. కానీ మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి మాత్రం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టిన దాఖలాలు లేవన్నారు. ఇలాంటి వారికి పదవులు, రాజకీయాలు మాత్రమే అవసరమని ప్రజా సంక్షేమం కాదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో పదవుల కోసం పాకులాడే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పక్కకు పెట్టి ప్రజా సంక్షేమం కోసం పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రావిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పూజలు

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-1లో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి షోడశ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరిష్, ఆలయ కమిటీ వినోద్‌కుమార్, సత్తిరెడ్డి, ముత్యాలు, విజయ్, గురుబ్రహ్మం, బ్రహ్మం, శంకరయ్య, రంగ సుబ్బయ్య, సుధాకర్, కృష్ణ, కిషోర్‌చారి, రమణా రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ సీజ్

జగద్గిరిగుట్ట: ఇష్టానుసారంగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ శ్రీచైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఇప్పటికే రెండు వాటర్ ప్లాంట్లు ఉండగా నూతనంగా మరొకటి ఏర్పాటు చేశారని తెలిపారు. దీని కారణంగా సమీపంలోని బోర్లు ఎండిపోవడంతో పాటు భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయన్నారు. దీనికి తోడు నిత్యం ప్లాంట్ల నుంచి వచ్చే నీరు రోడ్లపై పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయని, సదరు ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్ఐ రజనీకాంత్ మంగళవారం సాయంత్రం వాటర్ ప్లాంట్ పరిశీలించారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేశారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతదేహం లభ్యం

• పెద్ద కుమారుడిపై అనుమానంతో విచారిస్తున్న పోలీసులు
• పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తాం

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ ఎర్రకుంట తాండాకు చెందిన గణ్యా, ముదావత్ సక్కుభాయి(48)లు భార్యాభర్తలు. వీరికి అంజి, శేఖర్ ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఆరేళ్ల క్రితమే చనిపోయాడు. రెండేళ్ల నుంచి సక్కుభాయి తన ఇద్దరు కుమారులతో కలిసి డి.పోచంపల్లి సర్వే నం.120లో నివాసముంటోంది. కుమారులు ఇద్దరికి వివాహాలు అయ్యాయి. సక్కుభాయి అడ్డాపై కూలీతో పాటు క్యాటరింగ్ పనులు చేస్తోంది. ఇద్దరు కుమారులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.

◆ ఈనెల 20వ తేదీన క్యాటరింగ్ పనులు ఉండటంతో పెద్ద కుమారుడు అంజి సాయంత్రం సమయంలో తల్లిని గండిమైసమ్మ చౌరస్తాలో తన బైక్‌పై దింపాడు. మరుసటి రోజు తల్లి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. బౌరంపేట సాయినాథ్ సొసైటీలోని నిర్మానుష ప్రాంతంలో ఉన్న నీటి గుంతలో ఈనెల 21వ తేదీ సాయంత్రం సక్కుభాయి మృతదేహం లభ్యమైంది. ఒంటిపై గాయాలతో పాటు రక్తపు మరకలు ఉన్నాయి.

◆ మృతురాలి చిన్న కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కాగా సక్కుభాయిని బైక్‌పై తీసుకెళ్లిన పెద్ద కుమారుడు అంజి తల్లిని హతమార్చి నీటి గుంతలో పడేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అంజిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మల్కాజిగిరి పార్లమెంట్‌లో 12 నామినేషన్లు

ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి మంగళవారం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా కామ్రేడ్ సత్యం రెండు సెట్లు, తల్లాడ వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తరఫున రెండుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థిగా కె.వి.గీత కుమారి, విడుతలై చిరుతాయిగల్ కట్చ్ అభ్యర్థిగా మంచిని ఆంజనేయులు రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జక్కుల నర్సింలు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా కొండా అప్పారావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కె.పి.విజయ కుమార్, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా చేపూరి రాజు నామినేషన్ దాఖలు చేయడం జరిగిందన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గంటా చరితరావు, దొంతుల భిక్షపతి, ముస్త్యాల రామచంద్రం ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి కుటుంబ ఆస్తులు రూ.82.54 కోట్లు

• అప్పులు రూ.10.20 కోట్లు, నగదు రూ.5.70 లక్షలు
• కుటుంబానికి నాలుగు కార్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి కుటుంబానికి సంబంధించిన ఆస్తులు రూ.82.54 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో చరాస్తులు రూ.20.42 కోట్లు ఉన్నాయి. రాగిడి కుటుంబానికి అప్పులు రూ.10.20 కోట్లు ఉన్నాయని తెలిపారు. కుటుంబం(భార్యాభర్తల) చేతిలో ప్రస్తుతం నగదు రూ.5.70 లక్షలు ఉండగా, బంగారం 2,000 గ్రాములు, వెండి నాలుగు కిలోలు, ఒక డైమండ్ ఉన్నట్లు తెలిపారు. కుటుంబానికి నాలుగు వాహనాలు ఉన్నాయి. రాగిడి లక్ష్మారెడ్డిపై ఒక పోలీసు కేసు కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో కోసం ఔత్సాహిక విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రయత్నాలకు మద్దతిచ్చే లక్ష్యంతో కోచింగ్ అవసరమైన అంశాలు, మార్గదర్శకాలను అందిస్తామన్నారు. విద్యార్థులు అనుకున్న కేరీర్‌లో విజయం సాధించడానికి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష-24 కోసం ఈనెల 25 నుంచి ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం


కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు తలారి వీరేష్‌ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి, తులసి అశోక్, జయరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జీతయ్య, గోపాల్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా హన్మంతరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ జయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, జగన్‌యాదవ్, నాగరాజుయాదవ్ తదితరులు ఉన్నారు.

కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు


కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి గడ్డం శ్యాంప్రసాద్‌రెడ్డి, శివకుమార్ అన్నదానం ఏర్పాటు చేశారు. కట్ట మైసమ్మకు మొక్కులు తీర్చుకుంటే కోరిన కోరికలు తీరుతాయనే భావన భక్తుల్లో ఉండటంతో రోజురోజుకు ఇక్కడ తాకిడి ఎక్కువవుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ వస్తున్నారు. అన్నదానంలో సుమారు 500 మందిపైగా పాల్గొన్నారు. త్రిశూల్‌రెడ్డి, సంగీత దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ విజయానికి కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. బాచుపల్లి కౌసల్య కాలనీ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు కొల్లి వెంకటరెడ్డి, సలహాదారుడు నారాయణమూర్తిలతో పాటు పెద్ద సంఖ్యలో అనుచరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ కొల్లి మాధవి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ మల్లారెడ్డి, ఉదయ్‌కిరణ్, ప్రసాదరాజు పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కార్పొరేటర్ విజయలక్ష్మి, కౌసల్య కాలనీ కార్యవర్గ సభ్యులు

వెల్డింగ్ చేస్తుండగా చెలరేగిన మంటలు

మినీ బస్సు, డీసీఎం దగ్ధం



సుభాష్‌నగర్: ఓ మెకానిక్ షెడ్డులో డీసీఎంకు వెల్డింగ్ చేస్తున్న క్రమంలో మంటలు వ్యాపించి మినీ బస్సు, డీసీఎం అగ్నికి ఆహుతయ్యాయి. బహదూర్‌పల్లిలోని ఓ మెకానిక్ షెడ్డులో మంగళవారం మధ్యాహ్నం డీసీఎంకు మరమ్మతులు చేసే క్రమంలో వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మినీ బస్సుకు అంటుకున్నాయి. దీంతో మినీ బస్సు, డీసీఎం మంటల్లో దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

కనులపండువగా తిరు కల్యాణ మహోత్సవం

జగద్గిరిగుట్ట: పద్మానగర్ పద్మానగర్ ఫేజ్-1లోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. 24, 25 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు